ఇంటి నంబర్ల కేటాయింపుపై విచారణ

- అవినీతి జరగలేదంటూనే అంగీకరించిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావు
- ఆరోపణల నేపథ్యంలో ఆర్వో, ఆర్ఐలను బదిలీ చేశామని వెల్లడి

దుండిగల్, జూలై 31 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల నూతనంగా జారీ చేసిన ఇంటి నంబర్లు పెను దుమారాన్నే రేపుతున్నాయి. లబ్ధిదారుల వద్ద లక్షలాది రూపాయలు దండుకున్న అధికారులు, సిబ్బంది అనర్హులకు ఇంటి నంబర్లను కేటాయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో 'నమస్తే తెలంగాణ'లో జూలై 30న 'నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఇంటి నంబర్ల దందా..!' పేరిట ప్రచురించిన కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది.

దాంతో స్పందించిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావు ఇంటి నంబర్ల కేటాయింపులో అవకతవకలు జరగలేదని చెబుతూ.. మరోసారి ఆరోపణల నేపథ్యంలోనే మున్సిపల్ రెవెన్యూ అధికారి(ఆర్వో) మధుసూధన్‌రెడ్డి, ఆర్ఐ(రెవెన్యూ ఇన్స్‌పెక్టర్) రవీందర్‌రెడ్డిని బదిలీ చేశామని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మరో వైపు ఈ కేసులో కీలకంగా మారిన బిల్ కలెక్టర్(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి) లక్ష్మణ్‌ను మాత్రం ఉద్యోగం నుంచి తీసేసినట్లు పేర్కొన్న డాన్ని బట్టి బాచుపల్లి, రాజీవ్‌గాంధీనగర్‌లో ఇంటినంబర్ల కేటాయింపులో భారీగా అవకత వకలు జరిగినట్లు కమిషనరే అంగీకరించిన ట్లైంది. మొత్తం మీద గత రెండు రోజులుగా నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఇదే హాట్‌టాపిక్.

ఒక్క రాజీవ్‌గాంధీనగర్‌లోనే కాకుండా కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములకు ఇంటినంబర్లు కేటాయించినట్లు పలువురు 'నమస్తే తెలంగాణ' దృష్టికి తెస్తున్నారు. ఇదిలా ఉంటే తమకు ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఇంటి పట్టా ఉన్నప్పటికీ అమ్యామ్యాలు ఇవ్వలేదన్న కారణంతో అధికారులు ఇంటినంబర్లు కేటాయించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నంబర్ల కేటాయింపులో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఆర్వో, ఆర్ఐలతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులపైనా కలెక్టర్ సమగ్రవిచారణ జరపాలనే డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నాయి.

35 ఇంటినంబర్లు మాత్రమే జారీ చేశాం..

కాగా గత మూడు నెలల కాలంలో రాజీవ్ గాంధీనగర్‌లో 35 ఇంటినంబర్లు మాత్రమే కేటాయించాము. ఇంటినంబర్ల కేటాయింపులపై ఆరోపణలు నేపథ్యంలో వాటిపైనా విచారణ జరుతున్నాము. ఒకవేళ వాటిల్లో ఎవైనా తప్పుడు పత్రాలతో ఇంటి నంబర్లు జారీ చేసినట్లైతే వెంటనే క్యాన్సిల్ చేస్తాం.

– నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావు

పార్కు సుందరీకరణను త్వరగా పూర్తిచేయాలి

అల్లాపూర్, జూలై 31 : అల్లాపూర్ డివిజన్ పరిధి గాయత్రినగర్ సున్నం చెరువు పార్కు సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని కార్పొరేటర్ సబీహాబేగం అధికారులకు సూచించారు. బుధవారం అధికారులతో కలిసి పార్కు అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గాయత్రినగర్ లైబ్రరీ పార్కు, ఆర్‌కె సోసైటీ పార్కుల్లో అన్ని రకాల వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దామన్నారు.

పారిశుధ్య ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 31 : పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు.. బుధవారం తెలంగాణ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా శానిటేషన్ సామగ్రి ఇవ్వడం లేదని, వెంటనే ఇప్పించాలని కోరారు. ఫీఆర్ ఎస్ విధానంలో ఎస్ఎఫ్ఏలను వారాంతర సెలవులు,అబ్సెంట్‌లు యాప్‌లోనే ఉండేలా చూడాలని కోరారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన కార్మికులు, ఎస్ఎఫ్ఏలకు, బీఎల్‌వోలుగా,రూట్ ఆఫీసర్లుగా పనిచేసిన వారికి డబ్బులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలం చిరంజీవి, నర్సింహా, రమేశ్, సాయికుమార్, లక్ష్మీపవన్, కృష్ణకుమార్, దేవరాజ్, మల్లిఖార్జున్, మల్లేశ్, సంజీవ్‌కుమార్, వీరస్వామి ఉన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనందిస్తా..

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



విద్యార్థులకు బ్యాగులు, ఇతర సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, జూలై 31 : పేద విద్యార్థులకు చేయూతనందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బుధవారం బాలానగర్ డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బ్యాగులు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు అండగా నిలువడమే ప్రధాన కార్యాచరణ అన్నారు. గత ఏడాది కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని 12వేల మంది విద్యార్థులకు బ్యాగులు, సామగ్రి అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ గాంధీనగర్ పాఠశాలలో 170 మంది విద్యార్థులకు బ్యాగులు, సామగ్రి అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు ఖాజా, అబ్దుల్ అజీజ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వండి..

జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న జేపీసీ చైర్మన్ భిక్షపతి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 31 : వర్సిటీల్లో బోధన, బోధనేతర ఉద్యోగాల్లో తెలంగాణ ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని బుధవారం జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావుకు జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి వినతిపత్రం అందజేశారు. వర్సిటీ పరిపాలన విభాగాల్లో బోధన, బోధనేతర ఉద్యోగాల్లోనూ ఏడాది పూర్తి చేసిన వారికి స్థానచలనం కల్పించాలని, ప్రధానంగా తెలంగాణ వారికి అవకాశం కల్పించాలని కోరారు. వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రతి ఉద్యోగికి ఏడాదికి ఒకసారి స్థానచలనం కల్పించ డాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగులకు ప్రాంతీయ భేదం లేకుండా అర్హతలకు తగిన విధంగా పరిపాలన విభాగంలో పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గరి సందీప్ ఉన్నారు.

ఇంటి స్థలం ఇచ్చి నిరుపేదలను ఆదుకోండి : బీఆర్ఎస్

బాచుపల్లి తాసీల్దార్ పూల్‌సింగ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, బాలాజీనాయక్

దుండిగల్,జూలై 31 : బాచుపల్లిలోని ఇంద్రానగర్ కాలనీ, బైరవుని చెరువు సమీపంలో కొన్నేండ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు 100 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని, లేదంటే డబుల్ బెడ్‌రూం ఇండ్లైనా ఇప్పించా లని బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు వాంకుడోత్ బాలాజీనాయక్, కాసాని సుధాకర్ బుధవా రం పూల్‌సింగ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తాసీల్దార్ సైతం సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడు పరమేశ్ నాయక్, రాజునాయక్, కొలన్ బాల్‌రెడ్డి, సయ్యద్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌కుంట పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి..

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట పార్కులో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి మాజీ కార్పొరేటర్ రంగారావు బుధవారం పర్యటించారు. పార్కులో దెబ్బతిన్న ఓపెన్ జిమ్ పరికరాలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ తెలిపారు. అనుపమ హాస్పటల్ వెనక వైపు పొంగిపొర్లుతున్న డ్రైనేజీ లైన్‌కు తక్షణ మరమ్మతులను చేపట్టేలా అధికారుల దృష్టికి తీసుకెళతానని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మేడ్చల్,జూలై 31: ప్రస్తుత సమాజంలో సాంకేతికకు ప్రాధాన్యత పెరిగింది, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని శాసిస్తున్న సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించడానికి క్రమ శిక్షణతో కష్ట పడాలన్నారు.

పార్కుల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలి : జడ్సీ

కృష్ణకాంత్ పార్కులో పర్యటిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి, ఇతర అధికారులు

మియాపూర్ , జులై 31 : పార్కులు పచ్చదనంతో ఆహ్లాదానికి నెలవుగా ఉండాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్కుల్లో పచ్చదనం పెంపునకు మరింత కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్సీ శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్‌లో కృష్ణకాంత్ పార్కు, యూసుఫ్‌గూడ బస్తీ, బోరబండ, ఆర్‌కే కాలనీ, కల్యాణ్‌నగర్‌ల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మకమైన కృష్ణకాంత్ పార్కు మరింత పచ్చదనంతో ఉట్టిపడేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కులోపల ఎటువంటి చెత్త, గ్రీన్ వేస్ట్ లేకుండా చూడాలని, చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకుంటూ నూతన మొక్కలను నాటాలని జడ్సీ పార్కు సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. వాకర్స్, ప్రజల కోసం పార్కులోపల ఆహ్లాదం పంచేలా తీర్చిదిద్దాలన్నారు. కాలనీల్లో పారిశుధ్య పనులను పక డ్బందీగా చేపట్టాలని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్లపై వరద నీరు నిల్వకుండా చూడాలని, గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చివేయాలన్నారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీ నాయక్, అనిల్‌కుమార్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా కార్యకర్తల ముందస్తు అరెస్ట్

కొంపల్లిలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సరితారావును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

కుత్బుల్లాపూర్, జూలై 31 : నగరంలో ఇటీవల మహిళలపై జరిగిన అఘాయిత్యాలను ఖండిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఇందులో భాగంగా పేట్ బషీరాబాద్ పోలీసులు బీజేపీ మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి, సెన్సార్ బోర్డు సభ్యురాలు సరితారావును కొంపల్లిలోని ఆమె నివాసంలో హౌస్ అరెస్టు చేసిన తదుపరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సరితారావు మాట్లాడుతూ అరెస్ట్‌లతో మహిళలపై జరుగుతున్న దాడులను ఆపగలరా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నగరంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు.

చేపల మార్కెట్‌లో న్యాయబద్ధమైన కమిటీలు

కేపీహెచ్‌బీ కాలనీ చేపల మార్కెట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఫిషరీస్ కార్పొరేషన్ వైర్మన్ మెట్టు సాయికుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 31 : కేపీహెచ్‌బీ కాలనీలోని జీహెచ్ఎంసీ చేపల మార్కెట్‌లో త్వరలోనే న్యాయబద్ధమైన కమిటీలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని చేపల మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. మార్కెట్‌లో సమస్యలను వ్యాపారు లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. చేపల మార్కెట్‌లో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. మార్కెట్‌లో బయట వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారం రోజుల్లో న్యాయబద్ధమైన కమిటీలను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం శ్రీరంగం, మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, లక్ష్మయ్య, సంజీవరావు, నాగిరెడ్డి, పుష్పారెడ్డి, ప్రవీణ్‌కుమార్, అరవింద్‌రెడ్డి, అప్పారావు, కృష్ణ, మల్లి, రాజు, కిట్టు, వనజ, యమున, మణి, ఫణీంద్ర, సుందరి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ కాలనీలో సీసీ రోడ్డు పనుల పరిశీలన

నవోదయ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

మియాపూర్, జూలై 31 : ఆల్విన్ కాలనీ డివిజన్ నవోదయ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పదవీ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం

కొండాపూర్, జూలై 31 : కొండాపూర్‌లోని 8వ పోలీస్ బెటాలియన్‌లో సుదీర్ఘ సేవలందించిన సిబ్బంది పదవీ విరమణ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ సీ.సన్నీ బుధవారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం నిరంతరం కృషి చేసి పదవీ విరమణ పొం దిన ఏఆర్ఎస్ఐలు ఎస్ జేమ్స్, బాబూజీ, ఎన్ చంద్రశేఖర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, రెహమాన్, పార్థ సారధి, సీతారాం, అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రగతినగర్ బీజేపీ నాయకులు

దుండిగల్, జూలై 31: ప్రగతినగర్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ఇన్కాయిస్ సర్కిల్, మూడు కోతుల బొమ్మల చౌరస్తా వద్ద రోడ్లు గుంతలమయమై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అదే విధంగా ప్రగతినగర్‌లోని పలు కాలనీల్లో దోమల బెడద అధికంగా ఉందని, అంబీర్ చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రగతినగర్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, ప్రధానకార్యదర్శి మైలారం అశోక్, సీనియర్ నాయకులు డాక్టర్ ఎంఆర్ ఎస్ రాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, మదన్ గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, నవ్య, అనిరుద్ర, సాయికిశోర్, అర్జున్ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఆడియాలజీ), ఎమ్మెస్సీ (స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథలజీ) కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 5లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ. 300 అపరాధ రుసుముతో 12 వరకు చెల్లించవచ్చన్నారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 12వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ. 300 అపరాధ రుసుముతో 17వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు (బీసీటీసీఏ, బీహెచ్ఎంసీటీ) కోర్సుల పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలతో పాటు బీఫార్మసీ (పీసీఐ) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చెల్లించి, ఈనెల 6లోగా ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబుపత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చెల్లించి ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా.. సీఎం సహాయ నిధి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 31 : సీఎం సహాయ నిధి పథకం పేదల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తున్నదన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం 58 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 18,00,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ బుధవారం తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు పని చేస్తున్నదన్నారు. పేదరికానికి తోడు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతున్నదన్నారు. ఈ సాయంతో పేదలు కార్పొరేట్ దవాఖానల్లో వైద్యం పొందుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రావు, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేందర్, శ్రీనివాస్, అనిల్, దుర్గారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

ఫలహార బండ్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

బోనాల ఉత్సవాల్లో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్‌ల్లో బుధవారం నిర్వహించిన ఫలహార బండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి

- ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అర్చనరావు

కార్యక్రమంలో మాట్లాడుతున్న 'కల్కి' మూవీ ఫేమ్ ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అర్చనరావు

మాదాపూర్, జూలై 31: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిఫ్ట్)లో బుధవారం అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కొత్త బ్యాచ్ ఓరియెంటేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా 'కల్కి' మూవీ ఫేమ్ ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అర్చనరావు విచ్చేసి టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, వెల్స్పన్ గ్రూప్ సౌత్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీసా భార్గవ, నిఫ్ట్ డైరెక్టర్ మాలినితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిఫ్ట్‌లో అధ్యాపక బృందం విద్యార్థులను ఉన్నత శిఖరాల వైపు అధిరోహించేలా చేసేందుకు పూర్తి సహకారం అందిస్తారని అన్నారు. విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను ఒక ప్పుడు నిఫ్ట్‌లో చదువుకున్నట్లు తెలిపారు. నిఫ్ట్‌లో వైవిధ్యభరమైన విధానంతో విద్యార్థులను తీర్చిదిద్దనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల మాట్లాడుతూ.. దేశంలో నిఫ్ట్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. నిఫ్ట్‌తో కొలబ్రేట్ కావడం సంతోషంగా ఉందన్నారు. నిఫ్ట్‌లో ఇంటర్న్‌షిప్ చేయడం ఎంతో అవసరమన్నారు. కాగా నూతన బ్యాచ్ విద్యార్థుల కోసం మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిఫ్ట్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాట్ల పేరుతో డబ్బులు వసూలు

- బాధిత మహిళల ఫిర్యాదుతో రియాల్టర్ అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 31 : ప్లాట్లు విక్రయిస్తానని చెప్పి.. ఇద్దరు మహిళల నుంచి అడ్వాన్స్‌గా డబ్బు తీసుకుని తప్పించుకుని తిరుగుతున్న ఓ రియాల్టర్‌ను కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్ సుజాత, వివేకనందనగర్‌లో సరిత నివసిస్తున్నారు. కాగా కడప జిల్లాకు చెందిన నాగేంద్ర ఆచారి(32) షణ్ముఖ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వికారాబాద్ జిల్లా, నవాబుపేట మండలం, ఎల్లకొండ గ్రామంలోని సర్వే నంబర్ 307 నుంచి 313లో ఉన్న స్థలం షణ్ముఖ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు చెందినదని, ఆ స్థలంలోని ప్లాట్లను అమ్మకానికి పెట్టాడు. మార్కెటింగ్ ఏజెంట్లను పెట్టుకుని ప్రచారం చేశాడు. ఈ క్రమంలోనే ప్రైవేట్ పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్న సుజత, సరిత మార్కెటింగ్ ఏజెంట్ల ద్వారా నాగేంద్ర ఆచారిని కలిశారు. కేపీహ